నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
3 | నిజామాబాద్, శుక్రవారం 27 సెప్టెంబర్ 2024 | ADILABAD NIRMAL

స్వచ్ఛతపై అవగాహన ర్యాలీ

ర్యాలీ నిర్వహిస్తున్న పోస్టాఫీస్ సిబ్బంది, విద్యార్థులు

ఎదులాపురం, సెప్టెంబర్ 26 : స్వచ్ఛత భారత్ మిషన్ ప్రారంభించి పదేండ్లు పూర్తి అయిన సందర్భంగా స్వచ్ఛత హి సేవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టల్ దేవారెడ్డి సిద్ధార్థ అన్నారు. గురువారం పోస్టాఫీసు ఆధ్వర్యంలో ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కళాశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ వినాయక్, నేతాజీ చౌక్ మీదుగా సాగి తిరిగి కళాశాలకు చేరుకుంది. దేవారెడ్డి మాట్లాడుతూ.. సెప్టెంబర్ 17వ తేదీన ప్రారంభమైన స్వచ్ఛత హి సేవ కార్యక్రమం అక్టోబర్ 2 వరకు కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిద్ధార్థ కళాశాల అధ్యాకుడు శ్రీనివాస్, ఏఎస్పీ ఆదిలాబాద్ డివిజన్ లవకుశ్, హెడ్ పోస్టు మాస్టర్ గంగాధర్, ఐపీపీబీ మేనేజర్ రాజేశ్ కుమార్, ఐపీ రాజు నాగిరెడ్డి, కళాశాల అధ్యాకుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిని నియమించాలని ఆందోళన

పోషకులతో మాట్లాడుతున్న కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి

కడెం, సెప్టెంబర్ 26 : కన్నాపూర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు దాసరి రమేశ్ ఇటీవల యూ బిట్ కాయిన్ కేసులో అరెస్టు అయి జైలుకు వెళ్లడంతో ఆయన స్థానంలో ఉపాధ్యాయుడిని నియమించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పోషకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గురువారం ఆందోళన చేపట్టిన పోషకులు అధికారులకు సమాచారం అందించడంతో కడెం కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి, సీఆర్పీ రాజేశ్వర్‌తో కలిసి పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పోషకులతో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుడు రమేశ్ స్థానంలో నూతనంగా కడెం జడ్పీ పాఠశాల నుంచి మరో ఉపాధ్యాయుడిని కేటాయించడం జరుగుతుందని, అలాగే ఒక విద్యా వలంటీర్‌ను కూడా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. నూతనంగా మరో ఉపాధ్యాయుడు వచ్చే వరకు ఇద్దరు ఇక్కడే విధులు నిర్వహిస్తారని తెలిపారు.

భగీరథ పైప్‌లైన్ లీకేజీతో వృథాగా పోతున్న నీరు

పొన్నారిలో నీట మునిగిన బైక్‌ను వెలికితీస్తున్న గ్రామస్తులు

'భగీరథ' డ్యామేజ్

పొన్నారి గ్రామంలో ప్రధాన పైప్‌లైన్ పగలడంతో నీరు వృథా

తాంసి, సెప్టెంబర్ 26 : పొన్నారి గ్రామంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ పగలడంతో ఒక్కసారిగా పెద్ద శబ్దం వచ్చి నీరు వృథాగా పోయింది. పైప్‌లైన్ పగిలిన ప్రాంతంలో రెండు ద్విచక్రవాహనాలు పార్కింగ్ చేయగా అందులో పడిపోయాయి. ఒక వాహనాన్ని గ్రామస్తులు వెలికి తీయగా.. మరో బైక్ పూర్తిగా నీటిలో మునిగి డ్యామేజ్ అయింది. మరోవైపు పక్కన ఉన్న దుకాణంలో రిఫ్రిజిరేటర్‌తోపాటు కొన్ని వస్తువులు పాడైపోయాయి. భగీరథ పైప్‌లైన్ లీకేజీ కారణంగా నష్టపోయిన బాధితులకు పరిహారం అందించాలని స్థానికులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా.. కానీ గ్రామంలో భగీరథ నల్లాలతో ఒక్క చుక్క భగీరథ నీరు రావడం లేదని గ్రామస్తులు వాపోయారు. నీరు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ఉపాధ్యాయులకు బిగుస్తున్న ఉచ్చు

- యూ బిట్, క్రిప్టో కరెన్సీ కేసులో ఇద్దరు సస్పెన్షన్
- నిర్మల్ జిల్లాలో నాలుగుకు చేరిన ఉపాధ్యాయుల సంఖ్య

నిర్మల్ అర్బన్, సెప్టెంబర్ 26 : బడికి వెళ్లి బాధ్యతగా పాఠాలు చెప్పాల్సిన ఉపాధ్యాయులు తప్పుడు మార్గంలో అక్రమ సంపాదనలో పడ్డారు. జిల్లాలో సంచలనం సృష్టించిన బిట్ కాయిన్, యూ బిట్, క్రిప్టో కరెన్సీ మల్టీ లెవల్ మార్కెటింగ్ వ్యవహారంలో తాజాగా ఇద్దరు ఉపాధ్యాయులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ వ్యవహారంలో ఇద్దరు ఉపాధ్యాయులు కీలకంగా వ్యవహరించడంతో వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇందులో దాసరి రమేశ్(కడెం మండలంలోని కన్నాపూర్ ఎంపీపీఎస్ పాఠశాలకు చెందిన ఎస్జీటీ ఉపాధ్యాయుడు), కీరం వెంకటేశ్ గౌడ్(కుభీర్ మండలంలోని దౌజి నాయక్ తండాకు చెందిన ఎస్జీటీ ఉపాధ్యాయుడు) ఉన్నారు. వీరిద్దరిని పోలీసులు రిమాండ్ నివేదిక ఆధారంగా జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్ రెడ్డి గురువారం సస్పెండ్ చేశారు. ఈ వ్యవహారంలో ఏడుగురు అరెస్టు కాగా.. ఇందులో నలుగురు ఉపాధ్యాయులు సస్పెండ్ అయ్యారు.

జిల్లా వ్యవసాయశాఖ అధికారికి వినతిపత్రం ఇస్తున్న ఏఈవోలు(ఫైల్)

ఏఈవోలపై పనిభారం

- ఆందోళన బాటలో వ్యవసాయ విస్తరణ అధికారులు
- సమస్యలు పరిష్కరించాలని వినతి

ఆదిలాబాద్, సెప్టెంబర్ 26(నమస్తే తెలంగాణ) : గ్రామాల్లో రైతులకు సాగులో సలహాలు, సూచనలు అందజేసి వారి సమస్యలను పరిష్కరించాల్సిన వ్యవసాయ విస్తరణ అధికారులు(ఏఈవో)లపై అధికభారం పడుతున్నది. దీంతో వారు ఆందోళనబాట పట్టారు. తమ సమస్యలను పరిష్కరించాలంటూ జిల్లా వ్యవసాయ అధికారికి వినతిపత్రం అందజేయడమే కాకుండా కలెక్టర్ రాజర్షి షాను కలిసేందుకు సిద్ధమయ్యారు. ఆదిలాబాద్ జిల్లాలోని 18 మండలాల పరిధిలో 101 వ్యవసాయ క్లస్టర్స్ ఉండగా 100 మంది ఏఈవోలు ఉన్నారు. రైతులకు మెరుగైన సేవలు అందించడానికి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి క్లస్టర్‌కు ఒక వ్యవసాయ విస్తరణ అధికారిని నియమించింది. వీరు రైతు వేదికల్లో ఆయా క్లస్టర్‌ల రైతులకు అందుబాటులో ఉంటూ వారికి వానకాలం, యాసంగి సాగులో సలహాలు, సూచనలు అందించాలి. నాణ్యమైన విత్తనాలు, ఎరువుల సరఫరాతోపాటు పంటల విక్రయాల్లో రైతులు ఇబ్బందులు పడకుండా చూడడం, రైతుబంధు, రైతుబీమా, పీఎం కిసాన్, పంటల నమోదు, పంటనష్టం వివరాలు, రైతునేస్తం, సాగులో భాగంగా రైతులకు అవగాహన సదస్సుల ఏర్పాటు వంటి 49 రకాల విధులను ఏఈవోలు నిర్వహిస్తారు.

పనిభారం

రైతులకు సాగులో భాగంగా అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తున్న తమకు పనిభారం ఎక్కువైందని వ్యవసాయ విస్తరణ శాఖ విస్తరణ అధికారుల సంఘం నాయకులు అంటున్నారు. జిల్లాలో ఎనిమిది మండలాల్లో మండల వ్యవసాయశాఖ అధికారులు లేకపోవడంతో వివిధ రకాల పనులు తాము చేయాల్సి వస్తుందంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల రైతులకు రూ.2 లక్షల రుణమాఫీని ప్రకటించగా.. చాలా మంది రైతులు బ్యాంకు లోన్‌లు మాఫీ కాలేదు. దీంతో ప్రభుత్వం రైతుల వద్ద నుంచి దరఖాస్తులు తీసుకుని వారికి రుణమాఫీ అందేలా చర్యలు తీసుకుని మండలాల్లో నోడల్ అధికారులను నియమించింది. జిల్లాలో పలు మండలాల్లో ఏఈవోలు నోడల్ అధికారులుగా వ్యవహరిస్తున్నారు. వానకాలం ప్రారంభంలో రాశీ పత్తి విత్తనాల కొరత కారణంగా తమకు విధులు కేటాయించారని ఉదయం నుంచి సాయంత్రం వరకు తాము విత్తనాలు దుకాణాల్లో గడపాల్సి వచ్చిందని ఏఈవోలు అంటున్నారు. జిల్లాలో 101 వ్యవసాయ క్లస్టర్లలో ఒక్కో ఏఈవో మూడు నుంచి ఐదు రెవెన్యూ గ్రామాల్లో 5 వేల నుంచి 7 వేల ఎకరాల పరిధిలో పని చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయ సహాయకులను నియమించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించాలని వారు కోరుతున్నారు.

భవిష్యత్ కార్యాచరణ ఉంటుంది..

ప్రభుత్వం ఏఈవోల సమస్యలను పరిష్కరించాలి. లేనిపక్షంలో భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తాం. రెవెన్యూ శాఖలో వీఆర్ఏలు వీఆర్వోలు లేకపోవడంతో గ్రామంలో భూముల సర్వే నంబర్లు గుర్తించడం కష్టంగా మారింది. విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లను నియమించాలి. కేంద్ర ప్రభుత్వం డిజిటల్ క్రాప్ బుకింగ్ సర్వేను మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో ప్రైవేట్ ఏజెన్సీలతో చేయిస్తుండగా మన రాష్ట్రంలో ఏఈవోలకు అప్పచెప్పింది. ఇక్కడ ప్రైవేటు ఏజెన్సీలతో సర్వే చేయించాలి. **- కంది గంగారెడ్డి, ఏఈవోల సంఘం జిల్లా అధ్యక్షుడు**

త్వరితగతిన స్పందించాలి

ఎస్పీ గౌష్ ఆలం

ఎదులాపురం, సెప్టెంబర్ 26 : శాంతి భద్రతల సమస్యలు తలెత్తినప్పుడు త్వరితగతిన స్పందించి ప్రతిక్షణం అప్రమత్తంగా ఉంటూ విధులను నిర్వర్తించాలని ఎస్పీ గౌష్ ఆలం అన్నారు. గురువారం పోలీస్ హెడ్ క్వార్టర్స్ సమావేశ మందిరంలో జిల్లా పోలీసు అధికారులతో నెలవారి నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ఎలాంటి శాంతి భద్రతల సమస్యలైన తలెత్తినప్పుడు త్వరిగతిన ఘటన స్థలాలకు చేరుకునేలా పూర్తి సంసిద్ధంగా సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పెండింగ్ కేసులు వాటి ప్రస్తుత స్థితిగతులపై అధికారులను అడిగి తెలుసుకుని విచారించారు. ముఖ్యంగా గంజాయి, రౌడీషీట్లు, సస్పెక్ట్ షీ ట్లు, బైండోవర్లు, ఎస్సీ, ఎస్టీ కేసులు, పోక్సో కేసులు, దొంగతనాలు, మహిళలపై రిపోర్ట్‌ల వివరణ ఇలాంటి అంశాలపై సవివరంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ(ఆపరేషన్) బీ సురేందర్‌రావ్, డీఎస్పీలు ఎల్.జీవన్‌రెడ్డి, పోతారం శ్రీనివాస్, సిహెచ్ నాగేందర్, బి.సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్పీ గౌష్ ఆలం

జిల్లాకు నూతనంగా 10 మంది ఎస్సైలు

జిల్లాకు వచ్చిన నూతన 10 మంది ఎస్సైలను జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీస్ స్టేషన్‌లో కేటాయించడం జరిగిందని, వారికి పోలీస్ స్టేషన్‌లో ఉన్న ప్రతి ఒక్క విధులపై అవగాహన కలిగించి, శిక్షణ అందించాలని సంబంధిత ఎస్సైలకు సూచించారు. త్వరలోనే ప్రతి ఒక్క పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించడం జరుగుతుందని, ప్రతి ఒపోలీస్ స్టేషన్ పరిసరాలు, ఆవరణ పరిశుభ్రతతో ఉంటూ రికార్డులను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు.

స్వచ్ఛత హీ సేవలో భాగస్వాములు కావాలి

సారంగాపూర్, సెప్టెంబర్ 26 : ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జడ్పీ సీఈవో గోవింద్ అన్నారు. గురువారం మండలంలోని కొట్ల(బి) గ్రామంలో నిర్వహించిన స్వచ్ఛత హీ సేవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్టీపర్పస్ వర్కర్లకు పారిశుధ్య కిట్‌లను పంపిణీ చేశారు. ఇందులో ఎంపీడీవో లక్ష్మీకాంతరావు, ఎంపీవో అజీజ్ ఖాన్, డాక్టర్ వేదవ్యాస్, మాజీ జడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, ఏపీవో లక్ష్మారెడ్డి, ఏపీఎం మాధురి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జడ్పీ సీఈవో గోవింద్

ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఎలుక కాటు

ఖానాపూర్ రూరల్, సెప్టెంబర్ 26 : మండలంలోని మస్కాపూర్ కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులు ఎలుక కాటుకు గురైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ విషయమై పాఠశాల హెచ్ఎం సునీతరాణిని అడుగగా.. పాఠశాలలో గత గురువారం రాత్రి పడుకున్న ఎనిమిది మందిని ఎలుకలు కరిచాయి. వీరికి పెద్ద గాయాలు కాకపోవడంతో పాఠశాలకు వైద్యులను పిలిపించి యాంటి రాబీస్ టీకాలను వేయించినట్లు తెలిపారు. పాఠశాల పక్కకు చెరువు ఉండడంతో ఎలుకల భారీన పడుతున్నట్లు తెలిపారు.

వలంటీరే దిక్కు

ఒకే గదిలో అన్ని తరగతుల విద్యార్థులకు బోధిస్తున్న వలంటీర్

కుంటాల, సెప్టెంబర్ 26 : ఓలా గ్రామంలోని ప్రభుత్వ ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు ఉంది. ఇందులో 60 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ విద్యార్థులందరికీ షాజీద్ అనే ఉపాధ్యాయుడు బోధించేవారు. నెల రోజుల క్రితం డిప్యూటేషన్‌పై నిర్మల్‌కు వెళ్లారు. ఇదీ ఏకోపాధ్యాయ పాఠశాల కాగా.. మరో ఉపాధ్యాయుడిని నియమించకుండా పంపించారు. రెగ్యూలర్ ఉపాధ్యాయుడు లేక బోధన గాడితప్పింది. ఇప్పటికైనా బోధన సిబ్బందిని కేటాయించాలని తల్లిదండ్రులు, గ్రామస్తులు వేడుకుంటున్నారు. ఈ విషయమై ఎంఈవో ముత్యంను వివరణ కోరగా.. తాత్కాలికంగా ఒక ఉపాధ్యాయురాలిని ఓలా పాఠశాలకు పంపినట్టు తెలిపారు. ఆమె రాకపోవడంతో వలంటీర్‌తో బోధన చేయిస్తున్నారు. ఇటీవల జరిగిన డీఎస్సీ ప్రక్రియ పూర్తి కాగానే పూర్తిస్థాయి సిబ్బందిని నియమిస్తామని స్పష్టం చేశారు.

స్థితిగతులను తెలుసుకోవడానికే వచ్చా..

- రాష్ట్ర మహిళ కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద

జిల్లా జైలును సందర్శించిన మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శారద, కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, సెప్టెంబర్ 26 : జిల్లా జైలులో ఉన్న మహిళ ఖైదీలను నామమాత్రంగా కలిశాము అని కాకుండా వాస్తవంగా వారి పరిస్థితులు, స్థితిగతులను తెలుసుకోవడానికే వచ్చానని రాష్ట్ర మహిళ కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద అన్నారు. రెండు రోజుల జిల్లా పర్యటనలో భాగంగా గురువారం జైలును కలెక్టర్ రాజర్షి షాతో కలిసి సందర్శించారు. మహిళ ఖైదీలతో మాట్లాడారు. సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. డీఎంహెచ్ వో ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశామన్నారు. వారు ప్రాయశ్చిత్తంతో ఒత్తిడికి గురవుతున్నారని, మానసిక వైద్యుడిని నియమించాలని జైలు సూపరింటెండెంట్ అశోక్‌కుమార్ తన దృష్టికి తెచ్చారన్నారు. ఈ విషయాన్ని వైద్యారోగ్య శాఖ మంత్రి, సీఎం దృష్టికి తీసుకెళ్లి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జైళ్లలో మానసిక వైద్యులను నియమించేలా చూస్తామన్నారు. అంతకుముందు జైలులో చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె వెంట మహిళ కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి బి సబిత, ఏసీడీపీవో కె మిల్కా, డీఎంహెచ్‌వో కృష్ణ, డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, జిల్లా మలేరియా అధికారి ఎం శ్రీధర్, సఖీ నిర్వాహకురాలు సరస్వతి, జైల ర్ సూర్యప్రకాశ్, డీఎస్పీ జీవన్‌రెడ్డి ఉన్నారు.

మొరం తరలిస్తున్నారు..

- రెవెన్యూ, అటవీ శాఖ, అసైన్డ్ భూములే టార్గెట్
- నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు
- ప్రమాదాలకు కేంద్ర బిందువుగా భారీ గుంతలు

పొక్లెయినర్‌తో మొరం తవ్వకాలు

తలమడుగు, సెప్టెంబర్ 26 : కజ్జర్ల గ్రామంలో మొరం తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. మార్కెట్‌లో మొరానికి డిమాండ్ ఉండడంతో నిర్వాహకులు ఇష్టానుసారంగా తవ్వకాలు జరుపుతున్నారు. ఒకప్పుడు అక్కడ గ్రామం ఉండేది. చాలా ఏళ్లుగా ఒకరి నుంచి ఒకరికి భూములు మారుతూ వచ్చాయి. ప్రస్తుతం ఎవరి భూమి ఎక్కడ ఉందో తెలియక గ్రామస్తులు కాంట్రాక్టర్‌కు తమ భూములను అప్పగించేస్తున్నారు. దీనిని ఆసరా చేసుకుని మొరం నిర్వాహకులు రైతులకు కొంత ముట్టజెప్పి ధనార్జన లక్ష్యంగా తవ్వకాలు నిర్వహిస్తున్నారు. యథేచ్ఛగా మొరం తవ్వకాలు జరగడంపై గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

అక్రమంగా మొరం రవాణా

అనుమతులు లేకున్నా అక్రమార్కులు జేసీబీలతో తవ్వకాలు జరుపుతూ టిప్పర్లలో తరలిస్తున్నారు. ఇండ్ల నిర్మాణాలు, వెంచర్లు, రహదారులు, వంతెన నిర్మాణాలకు ఉపయోగిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరుపుతుండడంతో భారీగా గుంతలు ఏర్పడుతున్నాయి. ఆసైన్డ్ భూములతోపాటు రెవెన్యూ, అటవీ భూముల్లో తవ్వకాలు జరుగుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. జిల్లా కేంద్రానికి కూత వేటు దూరంలో ఉన్నా.. అధికారులు తమకేమి పట్టనట్లు ఉంటున్నారు. అధికారులు అక్రమ తవ్వకాలు జరుపుతున్న నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్రమంగా మొరం తవ్వకాలు జరపకుండా గతంలో గ్రామస్తులు, మండల తహసీల్దార్‌కు వినతిపత్రం అందించామన్నారు.

అధికారులు పట్టుకున్న మొరం వాహనం

మొరం, కంకర వాహనాల పట్టివేత

ఎదులాపురం, సెప్టెంబర్ 26 : జిల్లా భాగర్భగనుల శాఖ అధికారులు గురువారం అక్రమంగా మొరం తరలిస్తున్న రెండు టిప్పర్లతోపాటు వే బిల్లులు లేని రెండు టిప్పర్లను పట్టుకున్నారు. తలమడుగు మండలంలోని సుకిండి నుంచి ఆదిలాబాద్‌కు వస్తున్న కంకర టిప్పర్లను ఆపి తనిఖీ చేయగా.. ఎలాంటి వే బిల్లులు లేవని, తలమడుగు మండలం కజ్జర నుంచి ఆదిలాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న మొరం టిప్పర్లను మావల మండలంలోని బట్టి సవర్‌గాం వద్ద పట్టుకున్నట్లు మైనింగ్ ఏడీ రవీందర్ తెలిపారు. నాలుగు వాహనాలకు రూ.15,624 జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో టెక్నికల్ అసిస్టెంట్ రమేశ్ ఉన్నారు.

ఉద్యమంలో ఐలమ్మ ముఖ్యభూమిక పోషించారు

- 129వ జయంతి కార్యక్రమంలో కలెక్టర్ రాజర్షి షా


విగ్రహానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ రాజర్షి షా, డీబీసీడీవో రాజలింగు

ఎదులాపురం, సెప్టెంబర్ 26 : తెలంగాణ రైతాంగ సాయుధ ఉద్యమంలో వీరనారి చాకలి ఐలమ్మ ముఖ్య భూమిక పోషించారని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఐలమ్మ 129వ జయంతిని పురస్కరించుకుని రిమ్స్ ఎదుట కలెక్టర్ రాజర్షి షా ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ.. ఐలమ్మ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నదని తెలిపారు. అనంతరం ఆర్ఎస్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, సంఘం నాయకులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో డీబీసీడీవో రాజలింగు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు చిక్కల దత్తు, కలలా శ్రీనివాస్, రజ క సంఘం పట్టణాధ్యక్షుడు మల్కుల్‌వార్ సంతోష్, కార్యదర్శి ముస్కు వినోద్ పాల్గొన్నారు.

ఆమె పోరాట స్ఫూర్తి మరువలేనిది.. : రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్

నిర్మల్ అర్బన్, సెప్టెంబర్ 26 : చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి మరువలేనిదని రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో చాకలి ఐలమ్మ 129వ జయంతిని అధికారికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఐలమ్మ పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి శ్రీనివాస్, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఐలమ్మ జయంతి..

చాకలి ఐలమ్మ జయంతిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం, మయూరి హోటల్ ఎదురుగా గల ఆమె విగ్రహానికి డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, రజక సంఘ సభ్యులు ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆమె చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజు పాల్గొన్నారు.

కనీస సౌకర్యాలు కల్పించాలి..

- కలెక్టరేట్ ఎదుట ధర్నా

ఎదులాపురం, సెప్టెంబర్ 26 : ఆదిలాబాద్ రూరల్ మండలం ఆర్లి(బి) పంచాయతీ పరిధి నిశాన్‌ఘాట్‌లో గుడిసెలు వేసుకుని ఉంటున్న వారికి సౌకర్యాలు కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు . గురువారం పేదలతో కలిసి కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పట్టాలతోపాటు కరెంట్ సౌకర్యం కల్పించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. 12 ఏండ్లుగా నిశాన్‌ఘాట్లో గుడిసెలు వేసుకుని పేదలు నివాసం ఉంటున్నారన్నారు. ప్రభుత్వం కూడా పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు సుముఖంగా ఉందని, అధికారులు నిశాన్ ఘాట్ ప్రజలకు పట్టాలిచ్చేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నళినిరెడ్డి, కుంటాల రాములు, అరుణ్ కుమార్, రమేశ్, అమీన బేగం పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నిశాన్‌ఘాట్ వాసులు

నిందితులను అరెస్టు చేయాలి..

ముథోల్, సెప్టెంబర్ 26 : తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డు ప్రసాదంలో జంతువుల కళేబరాల నుంచి తీసిన నెయ్యిని వాడడం దారుణమని, దీనికి కారకులను తక్షణమే శిక్షించాలని హిందూ సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ సందర్భంగా హిందూ సంఘాల యువకుల ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందువుల మనోభావాలు దెబ్బతీసే విధంగా ఉన్నాయన్నారు. హిందూ దేవాలయాలకు ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయాలన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న హిందూ సంఘాల యువకులు